## 9

# "ఇదే అది"

*"అయితే పేతురు ... బిగ్గరగా వారితో ఇట్లనెను. ... యోవేలు ప్రవక్తద్వారా చెప్పబడిన సంగతి యిదే, ..." (అపొ. 2:14-16; KJV).*

ఒక అసాధారణమైన ప్రయోగానికి గాను నేను నీవు కలిసి పదిమంది మనుష్యులను ఒకచోట చేర్చామనుకో. ఒక మధ్యరాత్రి వేళ వీళ్ళతో కలసి మనం ఒక పెద్ద పొలంలో నిల్చున్నాం. "మీరు నిలిచిన స్థలంలోనుండి వంద గజాల దూరంలో రెండు అంగుళాల వ్యాసం అడ్డు కొలతగల నల్లని గుండ్రని ఘన పదార్థం అక్కడ లక్ష్యంగా నిలబెట్టబడింది. ఆ లక్ష్యం నీ కుడివైపునుగాని ఎడమ వైపునుగాని ఉండవచ్చు; అది నీ ముందరగాని వెనుకగాని ఉండవచ్చు. మీలో ప్రతివానికి ఒక విల్లును, పది బాణాలును యివ్వబడతాయి. చీకటిగానున్నందున అది నీవు చూడలేకపోయినా, దాని స్థానం ఎక్కడుందో నీకు తెలియకపోయినా, మీలో ఒకరు సరిగ్గా ఆ లక్ష్యం యొక్క కనుగుడ్డులో ఆకస్మికంగా పొడుస్తాడేమో చూద్దాం" అని ఆ మనుష్యులకు చెప్పాం.

ఒక్కొక్కడు ఒక్కొక్కసారి, ఆ పదిమంది మనుష్యులు తమ బాణాలను వేస్తున్నారు, ఆ రెండు అంగుళాల వృత్తాన్ని అచ్చంగా దూసికొనిపోవాలని చీకటిని ఛేదిస్తున్నారు. కొందరు కుడివైపునకును, కొందరు ఎడమవైపునకును ఎక్కుపెట్టి కొడుతున్నారు. చివరకు, వంద బాణాలు కూడా వెలుగును చూడని కిరణాల్లా రాత్రి కటిక చీకటిలోనికి దూసుకెళ్ళాయి. అప్పుడు, మన టార్చ్ లైటులతో, ముందు నడిచి వెళ్లి లక్ష్య స్థానాన్ని గుర్తించాం.

ఎన్ని బాణాలు లక్ష్యం యొక్క కనుగుడ్డులో గుచ్చుకున్నాయనుకుంటావు? ఏవీ లేవు. "ఒక అంబైనను లేదు" అని నీవు నిరభ్యంతరంగా జవాబు యివ్వవచ్చు. "సహాయం చేయబడని మనుష్యులు వారు చూడని లక్ష్యాన్ని ఛేదించలేరు" అని నీవు యింకను చెప్పవచ్చు. నీవన్నది సరియే. ఏదియెలాగున్నా, ఈ వాస్తవాన్ని ఆలోచించు: "నరమాత్రులు ఏమి చేయలేరో, దానిని జరిగించడానికి దేవుడు దైవ ప్రేరేపితులైన మనుష్యులకు సామర్థ్యం కలిగించాడు!"

పాత నిబంధన కాలంలోను, ప్రభువైన యేసు యొక్క పరిచర్య కాలంలోను, పరిశుద్ధాత్మ యొక్క దైవికమైన విల్లునుండి ప్రవచనపు బాణాలు భవిష్యత్తు వైపుకు దూసుకొనిపోయాయి. కాలం యొక్క చేతితో భవిష్యత్తు అనే తెర ప్రక్కకు నెట్టబడినప్పుడు, ప్రతి బాణం లక్ష్యాన్ని పరిపూర్ణంగాను హెచ్చుతగ్గులు లేకుండగాను ఛేదించింది.

అందులో కొన్ని నామాలకు సంబంధించిన ప్రవచనాలు, కొందరు వ్యక్తుల యొక్క భవిష్యత్సంభవాలను సూచిస్తాయి. తక్కినవి ద్వంద్వ ప్రవచనాలు – ప్రవక్త యొక్క కాలానికి సంబంధించినవిగాను, మెస్సీయాకు సంబంధించినవిగాను సందేశాలు ఉంటాయి. ఇంకను కొన్ని మాదిరి ప్రవచనాలు ఉపమానాలయందు బయలుపరచి ఉపమేయాల ద్వారా, అంటే మాదిరియందు బయలుపరచబడి పోలికలయందు నెరవేర్చబడేవి. ప్రవచనం ఏ కోవకు చెందిందైనా, ప్రతి ప్రవచన బాణం దాని కేంద్ర స్థానాన్ని ఛేదించింది.

పాత నిబంధన ప్రవచనంలో సంఘము "సంఘమనే" పదంతో ఎన్నడూ సూచింపబడకపోయినా, అది తరచుగా సంబంధంతో సూచింపబడింది (ఆమోసు 9:11), మరికొన్ని సార్లయితే "నిత్య రాజ్యమను" ప్రత్యేకింపబడిన పదంతో సూచింపబడింది (దానియేలు 2:44). "క్రొత్త నిబంధన" వంటి అలాటి ప్రయోగాలతో గాని (యిర్మీయా 31:31) లేక "యెహోవా మందిర పర్వతమని" గాని సూచింపబడింది (యెషయా 2:2). పాత నిబంధన ప్రవచన సందర్భంలో, రానున్న రాజ్యమనేది ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది.

"రాజ్యము" యొక్క రాకను గూర్చి సూచించడానికిగాను ఆ మూడు రకాలైన ప్రవచనాలను పరిశుద్ధాత్మ వినియోగించుకున్నాడు. సంఘమును గూర్చి తెలిసిన ఒక ద్వంద్వ ప్రవచనాన్ని తీసికొందాం. అద్భుతమైన సంఘం ఆరంభాన్ని అది ఎలా ప్రత్యేకించి ఉంచుతుందో గమనించుదాం.

## వ్యాఖ్యానం: లేఖనం చెప్పేది ఏమి?

ప్రసిద్ధిగాంచిన యోవేలు యొక్క ప్రవచనాన్ని పెంతెకొస్తు దినాన పేతురు కోట్ చేశాడు (అపొ. 2:16-21; యోవేలు 2:28-32). పరిశుద్ధాత్మ అద్భుతరీతిగా దిగివచ్చినప్పుడు "అంత్య దినములు" అనే యుగం ఆరంభమౌతుందని ఈ ప్రవచనం సూచిస్తుంది.

### నెరవేర్పు యొక్క లక్షణం

యోవేలు యొక్క ప్రత్యక్షత ద్వంద్వ ప్రవచనమైయుంది: యోవేలు దినానికి, వారు తమ పాపముల విషయమై మారుమనస్సు పొంది దేవునివైపు మరలితే, జనులు ఆత్మసంబంధమైన ఆశీర్వాదములు పొందుతారనే దేవుని వాగ్దానాన్ని అది తెలుపుతుంది. భవిష్యత్ వర్తింపులో, నూతన యుగారంభానికి బయలు వెడలునట్లు పరిశుద్ధాత్మ కుమ్మరింపబడనున్న ఒకానొక దినంవైపు అది సూచిస్తుంది.

పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని గూర్చి ప్రభువైన యేసును, బాప్తిస్మమిచ్చు యోహానును

అపొస్తలులను హెచ్చరిక చేశారు. తన స్వల్ప కాలపు సువార్త ప్రకటన మధ్యను బాప్తిస్మమిచ్చు యోహాను యిలా అన్నాడు: "... నేను నీళ్లలో మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నాకంటె శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను; ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును" (మత్తయి 3:11). ఆయన పునరుత్థానాంతరపు సందేశంలో, తన అపొస్తలులకు ప్రభువైన యేసు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును వాగ్దానం చేసి, "తన తండ్రి వాగ్దానమని" ఆయన దానికి పేరు పెట్టాడు. అపొ. 1:4, 5 యిలా అంటుంది: "ఆయన వారిని కలిసికొని యీలాగు ఆజ్ఞాపించెను – మీరు యెరూషలేమునుండి వెళ్లక, నావలన వినిన తండ్రియొక్క వాగ్దానముకొరకు కనిపెట్టుడి; యోహాను నీళ్లతో బాప్తిస్మము ఇచ్చెను గాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందెదరనెను" మరియొక సందర్భంలో ఆయన వారితో యిలా అన్నాడు: "ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచి యుండుడి" (లూకా 24:49). పరిశుద్ధాత్మ బాప్తిస్మం ఎవరు పొందుతారనే విషయంలో యోహానుకంటె ప్రభువైన యేసు ఎక్కువ నిర్ధిష్టంగా తెలిపాడు. ఆయన అపొస్తలులే దాన్ని పొందుతారని ప్రత్యేకించి తెలిపాడు.

## నెరవేర్పు యొక్క భావం

అపొ. 2 యొక్క ఆరంభంలో, పరలోకంనుండి పరిశుద్ధాత్మ కుమ్మరింపబడగా యోవేలు యొక్క ప్రవచనాన్ని అపొస్తలులు అనుభవించారు. లూకా యిలా వ్రాశాడు: "మరియు అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ **ఆత్మ** వారికి వాక్ శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి" (అపొ. 2:3, 4). "బలముగా వీచు గాలివంటి శబ్దంగా" ఈ కుమ్మరింపు జరిగింది (అపొ. 2:2). పెంతెకొస్తు దినాన్ని ఆచరించడానికిగాను యెరూషలేమునందు గుమికూడిన జనము ఆ శబ్దం రాగా విని, ఏమి జరుగుతుందో విచారించడానికి ఒక చోటికి కూడివచ్చారు. వారు కూడి రాగా, దేవుని యొక్క గొప్ప కార్యాలు కూడి వచ్చిన వారి స్వభాషల్లో అపొస్తలులు మాట్లాడడం విని కలవరపడ్డారు.

వారు వినిన, చూచిన దాని విషయంలో జన సమూహాలకు ఎటు తోచక విభ్రాంతి నొందారు. భయమువలనను మరియు ఏమియు ఎరుగని స్థితివలనను, జన సమూహంలో కొందరు, అపొస్తలులు త్రాగి మత్తులైయున్నట్టు నేరస్థాపన చేశారు. పేతురు శ్రోతల యొక్క శ్రద్ధను ఆకర్షించి, ఆనాటి సార్వత్రిక భాషయైన గ్రీకులో అతడు వారికి బోధించినట్టున్నాడు. యేసే క్రీస్తయి ఉన్నాడనే రుజువులను అతడు వారికి చూపించాడు. పరిశుద్ధాత్మచే నడిపింపబడినవాడై, కుమ్మరింపబడిన పరిశుద్ధాత్మ యోవేలు ప్రవచనం యొక్క నెరవేర్పైయున్నట్టు అతడు వివరించాడు. యోవేలు ప్రవచనం కాలాంతంవరకు నిలుచునదైయున్నట్టు అతని మాటలు స్పష్టపరచాయి. "ప్రవక్తయైన యోవేలు ద్వారా చెప్పబడిన సంగతి యిదే" (అపొ. 2:16). గత తరంనుండి ప్రఖ్యాతిగాంచిన ఫాయ్

ఎల్. వాలెస్ యిలా అన్నాడు: “ఇది అదే, అని పేతురు చెప్పాడు!” నూతన యుగం, సంఘము యొక్క యుగం ఆరంభమౌతుంది. దైవ ప్రేరేపితుడైయున్న అపొస్తలుడైన పేతురు, యోవేలు యొక్క ప్రవచనానికి మనకు భాష్యం చెప్పాడు. ఖచ్చితమైన అతని వివరణ ప్రవచనానికి ఆత్మ యొక్క సొంత వ్యాఖ్యానం మనకు అనుగ్రహింపబడింది.

మానవ చరిత్ర సృష్టియొక్క అద్భుతములతో ఆరంభమయ్యింది – పురుషుడును, స్త్రీయు దేవుని చేతితో రూపింపబడ్డారు. అపొ. 2లో, భూమిమీద దేవుని ఆత్మ సంబంధమైన రాజ్యము యొక్క ఆరంభమందు, సంఘము దేవుని ఆత్మచే రూపుదిద్దబడినప్పుడు తిరిగి అద్భుత విధానం కన్పిస్తుంది.

## నెరవేర్పు యొక్క సంపూర్తి

యోవేలు ప్రవచనమంతా పెంతెకొస్తు దినాన నెరవేర్చబడలేదనేది సత్యమే. ఎందుకంటే, కుమారులు కుమార్తెలు, వృద్ధులు యౌవనులు, దాసులు దాసీలు పరిశుద్ధాత్మను పొంది ప్రవచిస్తారు, దర్శనాలు చూస్తారు, కలలు కంటారు అని యోవేలు అన్నాడు. ఆ దినాన ఆత్మ యొక్క ఈ ప్రత్యక్షతలన్నీ సంభవించినట్టు మనకు ఎలాటి రికార్డు కూడా లేదు. పైగా, ప్రవచనపు భాషలో, యోవేలు తన ప్రవచనపు చివరి భాగంలో, రాబోవు తీర్పు దినాన్ని సూచించియుండవచ్చును. యోవేలు ప్రవచించిన కొన్ని సంభవాలు మాత్రమే పెంతెకొస్తు దినాన నెరవేర్చబడియుండవచ్చు. “యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే” అనే పేతురు మాటలను మనం ఎలా అర్థం చేసికోవాలి?

యోవేలు ప్రవచనం యొక్క కేంద్ర స్థానమైయున్న, “అంత్య దినముల” అద్భుతమైన ఆరంభం ఆ దినమున నెరవేర్చబడిందని పేతురు ప్రకటిస్తూ ఉన్నాడు. మానవాతీత సంభవం ద్వారా, అపొస్తలులు పరిశుద్ధాత్మతో బాప్తిస్మం పొందారు. దేవుని ప్రత్యక్షత మానవాళికి అందించునట్టుగా ఆ బాప్తిస్మం వారిని శక్తివంతులనుగా చేస్తుంది (అపొ. 2:22-36), పరిశుద్ధాత్మను యితరులకు పంచడానికిని (అపొ. 8:14, 15), అద్భుతములచే వారు ప్రకటించిన వర్తమానాన్ని స్థిరపరచడానికి ఆ బాప్తిస్మం వారిని శక్తిమంతులనుగా చేసింది (హెబ్రీ. 2:2-4). అందువలన, పెంతెకొస్తు దినమున అపొస్తలుల మీదికి వచ్చిన పరిశుద్ధాత్మ ప్రధాన జల ధారయై ఉండి, క్రైస్తవ యుగారంభమందు అద్భుతమైన సెలయేటిని పుట్టించింది. వారిని వెంబడించిన దినాల్లో అపొస్తలులు క్రైస్తవులపై తమ చేతులుంచి, పరిశుద్ధాత్మ యొక్క అద్భుతమైన కృపావరములను వారిపైకి రానిచ్చేవారు ఇలా రానివ్వడం లేక యివ్వడంవలన కుమారులు, కుమార్తెలు, వృద్ధులు, యౌవనులు, దాసదాసీలు ప్రవచనంలో పాల్గొంటారు.

“మనుష్యులందరి మీద” పరిశుద్ధాత్మను దేవుడు కుమ్మరిస్తాడని యోవేలు చెప్పాడు (అపొ. 2:17; యోవేలు 2:28). ప్రవచనంలోని ఈ భాగము తప్పక ప్రాతినిధ్యపు మార్గంలో నెరవేర్చబడింది. పెంతెకొస్తు దినాన అపొస్తలులు యూదుల కొరకు నిలిచారు (అపొ. 2). కొర్నేలీ యింట పరిశుద్ధాత్మ యొక్క కుమ్మరింపును, అన్యజనులు సహితం దేవుని రాజ్యం పొందినవారై ఉన్నారని బయలుపరచడానికి దేవుడు ఉపయోగించుకున్నాడు

(అపొ. 10). గనుక, పెంతెకొస్తు వద్ద అపొస్తలులును, తరువాత కొర్నేలీతో కూడనున్న అన్యజనుల కుటుంబం, స్నేహితులు – మనుష్యులందరికి ప్రతినిధులుగా దేవుడు తన ఆత్మను కుమ్మరించాడు.

## నెరవేర్పు యొక్క స్పష్టత

కుమ్మరింపబడిన దాని భావాన్ని గూర్చి ఎవరును కలవరపడనక్కరలేదు. అది యోవేలు ప్రవచనం యొక్క నెరవేర్పైయున్నట్టు దైవ ప్రేరేపితమగు పేతురు వ్యాఖ్యానంతో, ఆ సంభవం "అంత్యదినముల" ఆరంభమై ఉన్నట్టు మనం నిశ్చయత కలిగియుండవచ్చు. పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ బాప్తిస్మంతో ప్రత్యేకమైన యుగారంభం జరిగింది. ప్రవక్తలు దానికొరకు ఎదురు చూచారు, వారు దాన్ని గూర్చి ప్రవచించారు.

అద్భుతరీతిగా అపొస్తలులకు పరిశుద్ధాత్మను అనుగ్రహించుటచేత దేవుడు క్రొత్త నిబంధనను దాని స్థానంలో నిలుపగోరాడు. ఆ విధంగా మానవ చరిత్రలో చివరి భాగాన్ని ఆయన ఆరంభించాడు. లిఖిత పూర్వకమైన ప్రత్యక్షతగా నరునికి ఆయన చిత్తం సంపూర్ణంగా బయలుపరచి, సంఘ యుగం సంపూర్తిగా ఆరంభం కాగా, అద్భుతములు నిలిచిపోతాయి. ఎందుకంటె వాక్యం స్థిరపరచబడే అవసరం యికను ఉండదు (1 కొరింథీ. 13:8-10). అద్భుత సంబంధమైన కాలం అంతరిస్తుంది, కాని కాలాంతంవరకు సంఘ యుగం, "భూలోక చరిత్ర" యొక్క చివరి యుగంగా, కొనసాగుతుంది.

## ఉదాహరణ:

## లేఖనం యొక్క భావమేమి?

రానున్న దేవుని రాజ్యాన్ని గూర్చి ఒకడు పాత నిబంధన ప్రవచనాలను చదివాడు కాని ఆ ప్రవచనముల భావాన్ని గూర్చి దిగ్భ్రమ చెందాడనుకో. రానైయున్న రాజ్యము ఎట్టిదై ఉంటుందో అతనికి నిశ్చయంగా తెలియదు. ప్రవచనం యొక్క ఈ అంశాన్ని గూర్చిన గ్రహింపుకును స్పష్టతకును అతడు ఏ వైపు తిరుగగలడు?

ఆ మనుష్యుడు అపొ. 2 వైపుకు తిరుగవచ్చు. కీలకమైన ఈ అధ్యాయం ఆ ప్రవచనాల నెరవేర్పు యొక్క ఆరంభాన్ని అతనికి చూపుతుంది. రానున్న రాజ్యం ఎలా ఉంటుందనే విషయంలో అతడు భ్రమపరచబడినవాడై ఉంటే, రానున్న రాజ్యం యొక్క "వచ్చియున్న" రూపంలో అపొ. 2 దేవుని యొక్క చిత్తాన్ని అతనికి చూపుతుంది. రానైయున్న రాజ్యం ఎలాటిదైయుండాలో దాన్ని గూర్చి అతడు నిశ్చయత లేనివాడైతే, జనులు సంఘంలో ఎలా జీవించారో అపొ. 2 ఉపదేశిస్తుంది. రానైయున్న రాజ్యమును గూర్చిన ప్రవచనాలకు దైవికమైన నెరవేర్పు సంఘమే.

1975లో ప్రసంగపు దండయాత్రకు నేను సింగపూరు ఆహ్వానింపబడ్డాను. సుందరమైన సింగపూరు దేశాన్ని గూర్చి విన్నానుగాని దానిని అంతకుముందు ఎన్నడు సందర్శించలేదు. దీర్ఘకాలము సింగపూరులో మిషినెరీగా ఉన్న గోర్డన్ హోగన్ సంఘంతో కూడ ఆ సువార్త దండయాత్రలో సహాయపడడానికి సిద్ధపడేలా కొన్ని వివరాలను మాకు

పంపాడు. ఆరాధనా సమయాలు, ప్రజలు, పరిస్థితులను అవగాహన చేసికొనడానికి నేను ప్రయత్నించాను. నేను ప్రసంగించబోయే దేశాన్ని గూర్చి, జనులను గూర్చి సమాచారాన్ని సేకరించాను. ఆ దండయాత్రకు ముందు ఆరు నెలల కాలంలో, ఉత్తరాలను, చేయబడుతున్న ప్రకటనలను, ఆహ్వానపు కర పత్రికలను మేము పొందాం. దీనినంతటిని ఏకంగా సమకూర్చి ఆ దండయాత్ర ఎలా ఉండాలో చిత్రించాం. చివరికి, అమెరికానుండి మేము బయలుదేరే సమయం ఆసన్నమయ్యింది. విమానంలో పయనించిన 24 గంటల కాలం గడిచిన పిమ్మట మేము సింగపూరు చేరుకున్నాం. మొదటి ఆరాధన సమయంలో, "అదేలాటిదో యిప్పుడు నేను చూచాను. నేను యిప్పుడు గ్రహించాను" అని నేను చెప్పగలిగాను.

---

**పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ**
**బాప్తిస్మం ప్రత్యేకమైన యుగానికి ఆరంభం**
**పూర్వకాలపు ప్రవక్తలు దానివైపు తేరి చూచారు**
**వారు దానిని గూర్చి ప్రవచించారు.**

---

ఒకరు పాత నిబంధనను పఠించుతూ, రానున్న రాజ్యాన్ని గూర్చి అనేక ప్రవచనాలు ఆలోచిస్తూ ఉండగా, అది అవతరించినప్పుడు రాజ్యము ఎట్టిదైయుంటుందో అతడు మనో నేత్రంతో ముందుగా దృష్టించ ప్రయత్నించవచ్చు. సంఘము యొక్క రూపంలో రాజ్యం యొక్క ప్రారంభాన్ని దైవ ప్రేరేపితులగు పేతురు గుర్తించడాన్ని అపొ. 2కు అతడు తిప్పినప్పుడు వీక్షించగలడు. "తన ప్రవచనాలలో దేవుడు ఏమి భావించాడో యిప్పుడు నేను చూస్తున్నానని అతడు చెప్పగలడు." దాని "అసలైన" రూపంలో అపొ. 2నందు దేవుడు రాజ్యం యొక్క చిత్రాన్ని యిచ్చినందుకు మనం ఎంత కృతజ్ఞతగలవారమై యుండాలో!

పాత నిబంధన ప్రవక్తలు భవిష్యద్వాక్యం చెప్పిన రాజ్యం రాలేదని వాదించే వాళ్ళను చూచి తప్పు తోవను పట్టదు. ఒక్కసారి అపొ. 2ను తిరగేసి అద్భుతాలను గూర్చి చదివి ఈ ప్రవచనాలు నెరవేరాయని తెలుసుకోండి. అపొ. 2, రాజ్యం వచ్చిందని నిరూపించడం మాత్రమే కాదు, దేవుడు తన రాజ్యం ఎలా ఉండాలని కోరాడో కూడా తెలుపుతుంది.

## అంతర్జాతీయంగా రూపించడం:
## మనసుండి లేఖన భాగం ఏమి కోరుతుంది?

ఈ లేఖన భాగానికి మనం ఎలా ప్రత్యుత్తరమివ్వాలి? జీవితానికి దాన్ని ఎలా వర్తింపజేయాలి?

మొదటిగా, పాత నిబంధన ప్రవచనం యొక్క నెరవేర్పు మనలో సంశయించని దృఢ విశ్వాసంగా నాటుకుపోవాలి. సంఘారంభాన్ని గూర్చిన మన విశ్వాసము స్థిరంగాను

కదలనిదిగాను ఉండాలి. పరిశుద్ధాత్మ అద్భుతరీతిగా కుమ్మరించడంలో దాని ఆరంభాన్ని దేవుడు ప్రకటించాడు. సంఘారంభాన్ని బయలుపరచడానికి యింతకంటే ఏ శ్రేష్ఠమైన మార్గాన్ని దేవుడు ఎన్నిక చేసుకుంటాడు? రానున్న రాజ్యాన్ని గూర్చి యింతకంటె ఎక్కువ స్థిరంగా దేవుడు యింకా ఎలా బయలుపరచియుండేవాడు?

రెండవదిగా, పెంతెకొస్తు దినాన యోవేలు ప్రవచనం యొక్క నెరవేర్పు మనయందు అపార్థం చేసికోలేనంతగా పౌరత్వపు భావనను పుట్టించాలి లేక సృజించాలి. దేవుని రాజ్యం వచ్చియున్నట్టును, దానియందు మనం నివసింపగలిగినట్టి జ్ఞానంతో నమ్మికతో ఉండవచ్చు. ఆత్మను కుమ్మరించడంలో దేవుడు రూపొందించిన సాక్ష్యాన్ని మనం అంగీకరించినట్టయితే, దేవుని రాజ్య పౌరులుగా మనం రూపొంది జీవించగలమనే ఆనందదాయకమైన గ్రహింపుకు రాగలం. రాజ్యము యొక్క పోలికను, ప్రాముఖ్యతను, ప్రత్యక్షతను గూర్చిన నిశ్చయతను ఈ ప్రవచనము దాని నెరవేర్పు అనేవి మనకు యిస్తున్నాయి.

మూడవదిగా, అలసట చెందని సమర్పణతో మనం ప్రత్యుత్తరం యిద్దాం. దేవుని రాజ్యంలో జీవించడానికిని, దేవుని రాజ్య సందేశాన్ని ప్రకటించడానికిని మనం సమర్పించుకోవలసియుంది. ప్రభువైన క్రీస్తు ద్వారా ఆయన రాజ్యంలోనికి మనం మార్చబడ్డాం (కొలస్సీ. 1:13). “పరలోకానికి వెళ్లడానికి ప్రయత్నించడంలో మనం లోకపు పౌరులమై ఉండం; మనం పరలోక పౌరులమైయుండి ఈ లోకంగుండా పరలోకానికి వెళ్ల ప్రయత్నిస్తున్నాం” అని ఒక వ్యక్తి అన్నాడు. మనం పరలోక రాజ్యానికి చెందినవారం, ఆ రాజ్యాన్ని యితర జనులకు విస్తరింపజేయడంలో మనం పని కలిగియుండాలి.

## ముగింపు

అద్భుతంగా పరిశుద్ధాత్మ కుమ్మరింపబడడం అనే కార్యం సంఘం యొక్క అర్థాన్ని మానవాళికి స్థిరపరుస్తుంది. లేఖనాల ఉపదేశానికి నమ్మకంగా ఉండాలంటే, యోవేలు ప్రవచనం యొక్క ప్రధానమైన నెరవేర్పు అపొ. 2లో చూడవలసి ఉంటుంది. దేవుని రాజ్యము యొక్క రాకతో పెంతెకొస్తు దినాన “అంత్య దినములు” ఆరంభమయ్యాయి. పాత నిబంధన యొక్క ప్రవచనాలు రాజ్యం మీద బలంగా నొక్కి చెప్పినందున దీర్ఘకాలం అలా ఎదురు చూడడం జరిగింది.

చారిత్రక పెంతెకొస్తు దినాన సంఘ రాజ్యములో ఎలా ప్రవేశం జరిగిందో నేడు కూడా అలాగే జరుగుతుంది. పేతురు ప్రసంగించగా విశ్వాసులైన ప్రజలు, “మేమేమి చేయాలి?” అని అడిగారు (అపొ. 2:37). పరిశుద్ధాత్మచే ప్రేరేపింపబడినవాడై, “-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు” అని అతడు బదులిచ్చాడు (అపొ. 2:38). మూడువేల మంది అతని వాక్యమునంగీకరించి బాప్తిస్మం పొందారు. దేవుని రాజ్యములో ప్రవేశించినవారై వారు “అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయందును

ఎడతెగక యుండిరి” (అపొ. 2:42).

నేను తరచుగా హార్డింగ్ యూనివర్సిటీలోని నా విద్యార్థులకు ఇతర యువకులు వారితోపాటు ఉండగోరుతారని తెలియజేస్తాను. యోగ్యులైన అనేకమంది విద్యార్థులు హార్డింగ్‌కు కావలసిన ధనం లేక రాలేకపోతున్నారు. ఎవరైనా డబ్బు యివ్వగలిగితే వారు రాగలరు, వారు ఆ అవకాశాన్ని ఎంతగా ఉపయోగించుకుంటారో! పాత నిబంధనలో యోగ్యులైన వారికి రానున్న రాజ్యాన్ని గూర్చి చాలినంత తెలుసు, వారు దాన్ని చూడ తపించారు. దానిలో వారు భాగమై ఉండాలని ఎంతగనో కోరుకున్నారు. అయితే వారికి ఆ అవకాశం యివ్వబడలేదు. అది మనకు ప్రసాదింపబడింది. మనం “అంత్య దినములు” అనే యుగంలో ఉన్నాం. అత్యున్నతమైన, అసాధారణమైన కనికరం పొందే కాలమిది, రాజ్యము మన మధ్య ఉన్న కాలమిది. మనం చూస్తున్న వాటిని చూడగోరిన, మనం ఉండనవకాశమున్న దానిలో ఉండగోరిన ఆ పాత నిబంధన జనులను గూర్చి ఆలోచించు!

ఇట్టి పరిస్థితిలో, నీవు దేవుని రాజ్యానికి వెలుపల ఉంటే మాత్రం, ఆయన రాజ్యంలో ప్రవేశించడానికి త్వరపడు. నీ మీద ఉంచబడిన కృపకు హృదయ స్పందనతో కూడిన కృతజ్ఞతతో దానిని స్వీకరించు. ఆయన రాజ్యంలో నీవు ప్రవేశించియుంటే, “లోకం ఎక్కడికి వచ్చిందో చూడు” అని నిస్పృహతో గాక, “లోకంలోనికి ఏమి వచ్చిందో చూడు!” అని ఆనందించు.

## పఠనము మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. ఈ అధ్యాయపు ఆరంభంలో చర్చించిన మూడు రకాలైన ప్రవచనాలను గుర్తించుము. వాటిలో ప్రతిదానికి ఉదాహరణలిమ్ము.
2. “అంత్య దినములు” అనేవాటిని నిర్వచించుము.
3. యోవేలు ప్రవచనం ద్వంద్వ ప్రవచనంగా ఎలా ఉందో చర్చించు.
4. పరిశుద్ధాత్మ అపొస్తలులకు వాగ్దానం చేయబడినట్టు తెలిపే లేఖన భాగాలను పేర్కొనుము.
5. పెంతెకొస్తు దినమున పరిశుద్ధాత్మ కుమ్మరింపబడడాన్ని వర్ణించు.
6. పెంతెకొస్తు దినాన యోవేలు ప్రవచనమంతా నెరవేర్చబడిందా?
7. “యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే”యని చెప్పడంలో పేతురు యొక్క భావమేమి?
8. యోవేలు ప్రవచనంలోని – “మనుష్యులందరి మీద” అనే మాటలను నీవు ఎలా అర్థం చేసికొంటావు?
9. అద్భుతములు జరిగిన కాలం ఎప్పుడు నిలిచిపోయింది?
10. అపొ. 2 కీలకమైన అధ్యాయమని ఎందుకు పిలువబడింది?
11. యోవేలు ప్రవచనానికి మనం ఎందుకు బదులివ్వాలి?
12. దేవుని రాజ్యంలో మనం ఎలా ప్రవేశిస్తాం?
13. దేవుని సంఘంలో మనం ఎలా ప్రవేశిస్తాం?